సన్నబియ్యం పకడ్బందీగా పంపిణీ చేయాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రేషన్ దుకాణాలకు సన్న బియ్యం రవాణా, పంపిణీ పకడ్బం దీగా చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా సన్నబియ్యం పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సన్న బియ్యం రవాణాపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలంకు వస్తారని, సన్న బియ్యం స్వీకరించిన దళిత, గిరిజన కుటుంబాలతో కలిసి భోజనం చేస్తారని అన్నారు. జిల్లాస్థాయిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు పేదలతో కలిసి ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో భోజనం చేయాలని మంత్రి సూచించారు. సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ నూతన రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్య క్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై అధికారుల నజర్

● అడ్వర్టయిజ్‌మెంట్ ఏజెన్సీలపై కొరడా
● బకాయిలు చెల్లించని హోర్డింగ్స్ తొలగింపు


బకాయిలు చెల్లించని అడ్వర్టయిజ్‌మెంట్ హోర్డింగ్‌లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థకు సంబంధించిన అన్ని రకాల పన్నుల బకాయిలను రాబట్టడం ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ స్వయంగా రంగం లోకి వెళ్లి మొండి బకాయిలను వసూలు చేయిస్తున్నారు. మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు ఆస్తిపన్నుల ' బకాయిలపై దృష్టి పెట్టారు. 90 శాతం వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విస్తృత ప్రచారం చేసి నోటీసులను జారీ చేశారు. గడువులోగా పన్నులను చెల్లించని ఆస్తులను జప్తు చేయడం, నల్లాలను తొలగించడం, గేట్లకు తాళాలు వేయడం వంటి చర్య లు తీసుకున్నారు. 75 శాతం పన్నులను వ సూలు చేసి ఊపిరిపీల్చుకున్నారు. బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ పథకం గడువు ముగి సినందున వడ్డీతో సహా పన్నులను వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు. నల్లా కనెక్షన్ల పెండింగ్ బిల్లులు, ట్రేడ్ లైసెన్సు ఫీజులతో పాటు ఆదాయవనరుల్లో ప్రధానమైన అడ్వర్ట యిజ్‌మెంట్ పన్నులపై దృష్టి సారిస్తున్నారు.


హోర్డింగ్‌ల వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

● నగరంలో 300 హోర్డింగ్స్

నగరంలో 300 వరకు వివిధ సైజుల్లోని హోర్డింగ్స్ ఉండగా కొన్ని ఏజెన్సీలు రెగ్యులర్‌గా పన్నులు చెల్లిస్తూ వారి అనుమతులను రెన్యూవల్ చేయించుకుంటున్నాయి. మూడు, నాలుగు సంవత్సరాల నుంచి పన్నులు చెల్లించని ఏజెన్సీలపై కొరడా ఝళిపిస్తున్నారు. కోటి రూపాయల వరకు బకాయిలు పేరుకు పోవడంతో పెద్ద మొత్తంలో బకాయిలున్న ఏజెన్సీలకు నోటీసులు జారీ చేశారు. కొన్ని ఏజెన్సీల నిర్వాహకులు స్పందించి పన్నులు చెల్లించారు. మిగిలిన కొంత మంది ప్రస్తుతం తమకు యాడ్స్ రావడం లేదని, ఏజెన్సీ తొలగించుకున్నామనే పలు కారణాలు చెబుతూ పన్నులు చెల్లించడం లేదు. దీంతో శుక్రవారం కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణుతో కలిసి నగరంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన హోర్డింగ్ బోర్డులను పరిశీలించారు. ఆయా బోర్డులకు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్ పన్ను చెల్లించారా లేదా అన్నది పరిశీలించి, బకాయి ఉన్న బోర్డులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో కొన్ని హోర్డింగ్స్‌ను తొలగించారు. లక్షల్లో బకాయిలున్న ఏజెన్సీలకు సంబంధించిన హోర్డింగ్స్‌ను తొలగిస్తామని హెచ్చరించారు.

బాహ్యామందిర ప్రవేశం చేసిన ఉత్సవమూర్తులు

● ఇల్లందకుంటలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఇల్లందకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను బాహ్యామందిర ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా మూర్తులను గ్రామ ఆలయం నుంచి ప్రధాన ఆలయానికి మేళతాళాలతో తీసుకువచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహిళలు స్వామివారి తలంబ్రాలను కలిపారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ కొనేరును, కల్యాణ మండపం వద్ద జరుగుతున్న పనులు, తలంబ్రాల బియ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు రాజయ్య, మోహన్, రంగన్న పాల్గొన్నారు.

ఆరు సంవత్సరాల్లోపు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆరు సంవత్సరాలలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని పర్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సిలబస్‌తో ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్లతో అంగన్‌వాడీల్లో బోధిస్తున్నారని అన్నారు. మహిళలు ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనం తరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీపీవో జగదీశ్వర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిత, సీడీపీవో శ్రీమతి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


సుడా చెర్మన్‌కు వినతిపత్రం అందచేస్తున్న జేఏసీ జిల్లా చెర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ మడిపెల్లి కాళీచరణ్ నాయకులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చెర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సుడా చెర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకుపోయి సమర్థవంతంగా అమలు చేసేది ప్రభుత్వ ఉద్యోగులేనని అన్నారు. వారి సంక్షేమాన్ని చూడవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. తమకు న్యాయబద్ధంగా రావలసిన జీతభత్యాలు, పెండింగ్ బిల్లులు, ఐదు డీఏలు, పీఆర్సీ, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. తాము దాచుకున్న డబ్బు తమకు రాకపోయేటప్పటికి ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సుడా చెర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యో గుల సమస్యలను మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మడిపెల్లి కాళీచరణ్, నాయకులు నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మిందర్ సింగ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, కోట రామస్వామి, రాజేశ్‌భరద్వాజ్, సుమంత్ రావు, శంకర్, శారద, సునీత, తిరుపతి, గంప చంద్రశేఖర్, కరుణాకర్‌రెడ్డి, మర్రి జయపాల్‌రెడ్డి, వెలిచాల వెంకటస్వామి, ఎల్ కనకయ్య, జి శ్రీనివాస్, కుమార్, ప్రేమ్‌సాగర్, హర్‌ప్రీత్‌కౌర్ పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రి కార్మికుల సమ్మె..వాయిదా


ధర్నా చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆసుపత్రి కార్మికులు శుక్రవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ మాట్లాడుతూ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేపట్టినట్లు తెలిపారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి హామీ ఇచ్చారని, ఈ మేరకు సమ్మెను మూడు రోజుల వరకు వాయిదా వేసినట్లు తెలిపారు. వేతనాలు చెల్లించకుంటే నిరవధిక సమ్మెలోకి వెళతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి అరుణ్, కార్యదర్శి టి కళావతి, ఉపాధ్యక్షురాలు శారద, రాజు, మహేశ్, మౌనిక, రాజయ్య, రజిత, అరుణ పాల్గొన్నారు.

● నెల జీతం విడుదల...

కార్మికులకు సంబంధించి మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని ఈ విషయమై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. శుక్రవారం నెల జీతం విడుదల అయిందని, మరో రెండు మూడు రోజుల్లో మిగితా రెండు నెలల జీతాలు అందజేస్తామన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..

● మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని నవాబుపేట, గాగిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమనికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లేక పోతే దేశంలో ప్రజాస్వామ్యమే లేదన్నారు. అంబేద్కర్, గాంధీ చరిత్రను ప్రజలకు తెలియజేయడానికి గాంధీ ఫొటోలతో, రాజ్యాంగ పుస్తకాలతో ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరించే బాధ్యత తనదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, చిట్టుమల్ల రవీందర్, ఐరెడ్డి సత్యనారయణరెడ్డి, పోలు స్వప్న, మాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్, మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మానకొండూర్‌లో 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'

● అధికారులతో కలిసి గ్రామాల బాట పట్టనున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమానికి ప్రత్యేకంగా తయారు చేయించిన వాహనం

తిమ్మాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి): ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నూతన కార్యాచరణ రూపొందించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని అక్కడే పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అనే కార్యక్రమాన్ని ఈ నెల 14న ప్రారంభించనున్నారు. ఇందుకు ప్రత్యేక వాహనాన్ని సిద్ధం చేయించారు. ఇందులో రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులకు అవసరమైన కంప్యూటర్ ఇతర సామగ్రి ఏర్పాటు చేయిస్తున్నారు. ఎమ్మెల్యే ఆన్ వీల్స్ వాహనంలో ఎమ్మెల్యే ప్రతి గ్రామానికి అధికారులతో కలిసి వెళ్లి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారు. జిల్లా యంత్రాం గం లేదా సెక్రటేరియట్ స్థాయిలో చర్చించాల్సిన సమస్యలను యాప్‌లో నమోదు చేసి, ప్రభుత్వానికి పంపిస్తారు. ఇందుకోసం ఎమ్మెల్యే ఆన్ విల్స్ అనే ప్రత్యేక యాప్ రూపొందిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ఓవర్‌లోడ్ తగ్గించేందుకే నూతన సబ్‌స్టేషన్లు


సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న టీజీఎన్‌పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ టి మధుసూదన్

హుజూరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్ట ణాల్లో ఓవర్ లోడ్ సమస్యలను తగ్గించేందుకే నూతన సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తు న్నామని టీజీఎన్‌పీడీసీఎల్ ఇన్‌చార్జీ డైరెక్టర్(ఆపరేషన్) టి మధుసూదన్ అన్నారు. శుక్రవారం పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన 33/11 సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులు అవసరం మేరకే విద్యుత్‌ను ఉపయోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రమేష్, డీఈలు లక్ష్మారెడ్డి, చంద్రమౌళి, కాళిదాస్, ఏడీఈలు శ్రీనివాస్, అంజయ్య, ఏఈ ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్ఐల బదిలీ

కరీంనగర్ క్రైం: కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఎస్ఐలు బదిలీ అయ్యారు. కమిషనరేట్ స్పెషల్ బ్రాంచి లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సందెబోయిన శ్రీని వాస్ చిగురుమామిడికి, అక్కడ పని చేస్తున్న ఎస్ఐ బి రాజేష్ వేకెన్సీ రిజర్వుకు బదిలీ అయ్యారు. చిగురు మామిడి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ కరీంనగర్‌లో సీపీ గౌస్ ఆలంను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

మూడు నెలలుగా అందని జీతాలు

● ఇబ్బంది పడుతున్న 328 ఉపాధిహామీ సిబ్బంది

మానకొండూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధిహామీ సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో 328 మంది సిబ్బంది పస్తులుంటున్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు చెందిన జీతాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి అద్దె, పిల్లల, పాఠశాల ఫీజులు, నెలవారీ అవసరాల కోసం ప్రతి నెల అప్పులు చేసి కాలం వెల్లదీస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో క్రిస్మస్, ఉగాది, రంజాన్ పండుగలకు పస్తులుండాల్సిన దుర్భర పరిస్థితి నెలకొందని జిల్లాలోని ఉపాధిహామీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 16 మండలాలుండగా అదనపు కార్యక్రమ అధికారులు 11 మంది, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు 8 మంది, సాంకేతిక సహాయకులు 40మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 15మంది, క్షేత్రసహాయకులు 250మంది, అటెండర్లు 12 మొత్తం 328మంది ఉన్నారు. మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలకు వినతిపత్రాలు సమర్పించారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి జీతాలను అందజేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.


ఎంపీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

పది తర్వాత ప్రత్యేక కోర్సులు

● ఇంటర్‌తోపాటు వొకేషనల్, డిప్లొమా కోర్సులు

7

వివాహితను బలి తీసుకున్న సోషల్ మీడియా

- వ్యక్తిగత వీడియోను పోస్టు చేసిన యువకుడు
- అవమానంతో ఆత్మహత్య

మల్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వ్యక్తిగత వీడియో వైరల్ అయిందనే మనస్థాపంతో జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత(23) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలి ఇంటి సమీపంలో ఉండే హుస్సేన్ అనే వ్యక్తి ఆమె వ్యక్తిగత వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీంతో మనస్థాపం చెందిన వివాహిత ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం కూతురు చూసి పక్కింటి వాళ్లకు తెలపడంతో పోలీసులకు సమాచారం అందించారు. తన మృతికి హుస్సేన్ అనే వ్యక్తి కారణమంటూ ఆత్మహత్యకు ముందు హిందీలో సూసైడ్‌నోట్ రాసింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. హుస్సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతురాలి భర్త రెండు సంవత్సరాలక్రితం ఉపాధికోసం దుబాయివెళ్లాడు. మృతురాలికి కొడుకు(4), కూతురు(2) ఉన్నారు.

డిగ్రీ విద్యార్థి బలవన్మరణం

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌లో చింతకుంట దుర్గాప్రసాద్(22) అనే డిగ్రీ విద్యార్థి శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... దుర్గాప్రసాద్ ఇంట్లో అందరు నిద్రిస్తుండగా తెల్లవారు జామున ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న దుర్గాప్రసాద్ పోలీస్ కానిస్టేబుల్, తదితర పోటీ పరీక్షలకు హాజరైనప్పటికీ ఏ ఉద్యోగం రాలేదని మనస్థాపం చెందిన ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి చింతకుంట శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

ముస్తాబాద్(గంభీరావుపేట), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామానికి చెందిన పాతూరి మల్లవ్వ(54) అనే మహిళ శుక్రవారం అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడింది. మల్లవ్వ గర్భకోశ వ్యాధితో కొంతకాలంగా బాధపడుతోంది. గతంలో సిద్దిపేటలోని ఓఆసుపత్రిలో మల్లవ్వకు ఆపరేషన్ కూడా అయ్యింది. అయినా వ్యాధినయం కాలేదు. తన అనారోగ్య సమస్యను తలచు కుంటూ మల్లవ్వ బాధపడేది. శుక్రవారం తన భర్తతో కలిసి మల్లవ్వ పొలం వద్దకు వెళ్లింది. భర్త రాంరెడ్డి పాడి గేదలకు మేత వేసేందుకు వెళ్లగా మల్లవ్వ అక్కడే ఉన్నచెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతురాలు భర్త రాంరెడ్డి ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో శుక్రవారం కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓగుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. మృతిచెందిన యువకుడి వయస్సు 20-25 మధ్యలో ఉంటుందని, ఆంధ్రకు చెందిన దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

ముస్తాబాద్(గంభీరావుపేట), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలో కోతుల దాడిలో ఓవృద్ధురాలు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరింది. కట్కూరి బాలవ్వ అనే వృద్ధురాలు తన ఇంటి వద్ద ఉండగా, కోతులు ఒక్కసారిగా దాడికి తెగబడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ బాలవ్వను బంధువులు ఓ ప్రైవేటుఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు.

సిరిసిల్ల నేతన్నల ప్రతిభ



నేసిన బంగారు చీరతో నల్ల విజయ్

సిరిసిల్ల ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేత కళాకారులు యెల్ది హరిప్రసాద్, నల్ల విజయ్‌లు తమ ప్రతిభను చాటుకుంటున్నారు. మరమగ్గాలపై తమ కళా నైపుణ్యంతో అద్భుతంగా చీరలను తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 6న జరిగే భద్రాద్రి సీతారాముల కల్యాణానికి బంగారు పట్టుచీరను హరిప్రసాద్ సిద్ధం నేశారు. అలాగే నల్ల విజయ్ పువ్వుల డిజైన్‌తో కూడిన బంగారు చీరను నేశారు. ఈ ఇద్దరి కళాకారుల ప్రతిభను చూసి పలువురు అభినందిస్తున్నారు.

సీతారాముల కల్యాణానికి బంగారు పట్టుచీర..

సీతారాముల కల్యాణం జనులందరూ ఎంతో సంబురంగా జరుపుకుంటారు. అందులో ముఖ్యంగా భద్రాదిలో జరిగే వేడుకలకు తరలివెళ్తారు. ఆ రాముడికి మరోసారి సిరిసిల్ల నేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్ మరో అద్భుతమైన బంగారు వర్ణంతో పట్టు చీరను సిద్ధం చేశాడు. ఈనెల 6న భద్రాది దేవాలయంలో జరిగే సీతారాముల కల్యాణపు వేడుకలకు అందించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విభిన్నమైన చీరలను తయారుచేస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన హరిప్రసాద్ 5.50 మీటర్లు 800 గ్రాముల బరువు గల చీరలో వన్ గ్రామ్ గోల్డ్ జరీని ఉపయోగించి చేనేత మగ్గంపై చీరను నేశారు. చీరపై సీతారాములు, లక్ష్మణుడు, ప్రతి రూపా లను నేశాడు. ఆరు రోజుల పాటు శ్రమించి తయారు చేసిన ఈ చీర కొంగుపై భద్రాది ఆలయ మూలవిరాట్ దేవతామూర్తులను నేశారు. చీర బోర్డర్‌లో శంఖు, చక్రనామాలు, హనుమంతుడు, గరుత్మంతుల ప్రతిరూపాలు నేశా డు. చీరలో శ్రీరామ, శ్రీరామ రామేతి రమే రామే మనోరమే, సహస్ర నామతాత్యుల్యం అనే శ్లోకాన్ని వచ్చే విధంగా 51సార్లు పొందు పర్చారు. అద్భుతంగా తయారైన చీరను కల్యాణం సందర్భంగా అందించనున్నారు. రెండు సంవత్సరాలుగా సీతారామ కల్యాణం సందర్భంగా చీరలను నేసి అందిస్తున్నారు.



చేనేత మగ్గంపై చీరను నేస్తున్న నేత కళాకారుడు హరిప్రసాద్, చీరపై సీతారాముల ప్రతిరూపం

ఆకర్షణీయంగా బంగారు చీర..

సిరిసిల్ల నేత కళాకారుడు నల్ల విజయ్ చేనేత మగ్గంపై అబ్బురపరిచే చీరలను నేస్తున్నాడు. తాజాగా పువ్వుల డిజైన్‌తో బంగారాన్ని ఉపయోగించి ఆకర్షణీయంగా చేనేత మగ్గంపై చీరను నేశాడు. బళ్లారికి చెందిన ఓ వ్యాపారవేత్త తన కుమార్తె కోసం 20 గ్రాముల బంగారాన్ని ఉపయోగించి చీరను నేయాలని విజయ్‌కు ఆర్డర్ ఇచ్చాడు. చీరపై బంగారు వర్ణంతో పువ్వులు పూసినట్లుగా నేశాడు. 5.50 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పుతో 800 గ్రాములు ఉన్న ఈ చీరను పది రోజులు శ్రమించి నేశాడు. గతంలో 200 గ్రాములు బంగారంతో చీరను నేశాడు. వెండి ని ఉపయోగించి రంగులు మార్చే చీరను, 222 రంగులతో పరిమళించే పట్టు చీరను తయారు చేశాడు.

హోటళ్లపై సివిల్ సప్లయిస్ అధికారుల దాడులు

- 102 గ్యాస్ సిలిండర్లు పట్టివేత

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్‌సప్లై అధికారి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో సివిల్ సప్లై అధికారులు శుక్రవారం నగరంలోని పలు టిఫిన్‌సెంటర్లు, హోస్టళ్లలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గృహవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 102 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ గృహవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్‌సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగించడం నేరమన్నారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈదాడుల్లో అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి బుచ్చిబాబు, డీటీసీఎస్ ఖాజా మోయినోద్దీన్, వసంత్‌రావు, సురేందర్, ఉష, ఎఫ్ఐఎస్ అన్వర్, వినోద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను శిక్షించాలి

ఎలిగేడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసిన సాయి కుమార్‌ని దారుణంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నిజనిర్ధారణ బృందం సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరేళ్ల సాయి కుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. వారు మాట్లాడుతూ సాయికుమార్ అదే గ్రామానికి చెందిన ఒక అమ్మాయి రెండేళ్లుగా ప్రేమించుకున్నారన్నారు. వీరి ప్రేమను సహించని అమ్మాయి తండ్రి సదయ్య మార్చి 27న సాయికుమార్‌ను హత్యచేశాడని పేర్కొన్నారు. కుల అసమానతల నిర్మూలన పోరాటసమితి, సాయిత్రిబాయిఫూలే మహిళాసంఘం వారు హత్యను ఖండించారు. హత్యకు ప్రధాన సూత్రధారులైన సిద్ధి సారయ్య, చీకటి హరీష్‌గౌడ్, చీకటి మల్లయ్యగౌడ్‌లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజనిర్ధారణ బృందం రాష్ట్రప్రధాన కార్యదర్శి కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జె.చక్రవర్తి, రాష్ట్ర సావిత్రిబాయిఫూలే మహిళ సంఘం అధ్యక్షురాలు గన్నారపు సరోజన, చైతన్య భారతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈరపాగ గోవిందు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర మోహనక్రిష్ణ, రాష్ట్ర నాయకుడు ఆరేపల్లి క్రాంతికిరణ్, రాష్ట్ర కన్వీనర్ తెలంగాణ సామాజిక ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం సభ్యుడు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎర్రవెల్లి రమేష్, రాములు

కోనరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికిచెందిన ఇద్దరు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఇద్దరు నీరటి రామయ్య, ఎర్రవెల్లి రమేష్‌లు గాయపడ్డారు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్ళింది. బాధితులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాజీవ్ రహదారిపై ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు ● అక్కడికక్కడే ఇద్దరి దుర్మరణం



గౌస్, ఇమ్రాన్(ఫైల్)



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

సుల్తానాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. రామగుండం కేజీఎస్ ఫంక్షన్ హాల్ ప్రాంతంలో నివాసం ఉండే మహ్మద్ గౌస్ అలియాస్ నిస్సార్(34) అనేయువకుడు ఎన్టీపీసీలోని ఒక జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అతడి స్నేహితుడు మహబూబ్ బస్తీకిచెందిన షేక్ఇమ్రాన్ (28) తోకలసి కారులో హైదరాబాద్‌వెళ్ళారు. అనంతరం హైదరాబాద్ నుంచి గురువారం రాత్రి రామగుండానికి తిరుగు ప్రయాణంఅయ్యారు. కారును మహ్మద్‌గౌస్ నడుపుతున్నాడు. సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో చేరుకునే సరికి శుక్రవారం తెల్లవారుజామున రాజీవ్ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుకనుంచి వేగంగా ఢీకొన్నారు. కారులో ఉన్న ఇద్దరిలో ఇమ్రాన్ అక్కడికక్కడే చనిపోగా, తీవ్ర గాయాలైన గౌస్‌ను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మరోగంటలో రామగుండం చేరుతారనగా ప్రమాదం జరగడం, ఇద్దరు చనిపోవడం వారి వారి కుటుంబాల్లో తీవ్రవిషాదం నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుల్లో మహ్మద్ గౌస్‌కు నాలుగేళ్ల క్రితమే వివాహం కాగా భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇమ్రాన్ అవివాహితుడు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు శుక్రవారం ఉదయం పట్టుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన చింతల శివరాజు ట్రాలీ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీచేయగా సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళ్లచెరువు గ్రామం వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకు న్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం పొత్తూరు గ్రామసమీపంలోని బిక్కవోలు నుంచి పెద్దలింగాపూర్ గ్రామానికి ఇసుక తరలిస్తామని రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. పెద్దలింగాపూర్ గ్రామానికి కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని సమా చారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుకను తరలిస్తున్న కరీం నగర్ జిల్లా ఖాజీపూర్ గ్రామానికి చెందిన అనుగొండ మధుపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సిలిండర్ పేలి ఇంటి పై కప్పు ధ్వంసం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజన్న పేట గ్రామానికిచెందిన బాలసాని నిర్మల-సమ్మయ్య ఇంట్లో శుక్రవారం సిలిండర్ పేలి ఇంటి పైకప్పు ధ్వంసమైంది. బాధితుల కథనం మేరకు ఇంట్లో వినియోగిస్తున్న సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో ఇంటి రేకులు ధ్వంసం అయ్యాయి. సిలిండర్ ప్రమాదంలో ఇంటి పైకప్పు రేకులు పగలడంతో పాటు, విద్యుత్ మీటర్, వంట సామగ్రి దెబ్బతినడంతో ఆర్థికంగా నష్టపోయామన్నారు. గ్యాస్ సంస్థ ఆదుకోవాలని బాధితులు కోరారు. సంఘటన స్థలానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

'ఉపాధి' పనులపై కూలీల ఆసక్తి



రామడుగులో పనులు చేస్తున్న కూలీలు

రామడుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. వేసవి ఎండలను సైతం లెక్కచేయకుండా కూలీలు పనులు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రతిరోజు మండలంలో వివిధ గ్రామాల్లో 1200మంది వరకు ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పెంచినరేట్లతో రోజుకు ఒక్కోకూలీకి 300రూపాయల వరకు చెల్లిస్తోంది. ఇందిరమ్మ ఆత్మీయభరోసా కార్యక్రమంలో భాగంగా భూమి లేని నిరుపేదలకు 12 వేల రూపాయలు అందిస్తుండడంతో కూలీలు తమకు కేటాయించిన పనిదినాలను చేపట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సంవత్సరానికి కనీసం 20 రోజులు పని చేసిన వారికి ఆత్మీయ భరోసా పథకం వరిస్తుంది. ఈ నేపథ్యంలో పనుల్లో పాల్గొనేందుకు పలువురు ముందుకువస్తున్నారు. మండలంలోని గుండి, గోపాల్‌రావుపేట, రామడుగు, వెదిర, కోరటపల్లి, దత్తోజిపేట, వెలిచాలతోపాటు అన్ని గ్రామాల్లో నీటికుంటలు, ఫార్మేషన్ రోడ్స్, డైవర్షన్ డ్రైన్స్, ఎస్సీ, ఎస్టీ స్మాల్, మార్జినల్ ఫార్మర్స్ ల్యాండ్ డెవలప్‌మెంట్ వర్క్స్ చేపడుతున్నారు. మండలంలో 8,582 జాబ్‌కార్డులు ఉండగా 3,506 మంది పనులు చేస్తున్నారు. ఇప్పటివరకు మండలంలో 1,97,500 పనిదినాలు కల్పించినట్లు ఏపీవో రాధ తెలిపారు.

అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తికి ఏడాది జైలు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అజాగ్రత్తగా వాహనం నడిపి 12 గొర్రెల మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా, బాధితుడికి లక్షరూపాయల పరిహారం చెల్లించాలంటూ జగిత్యాల కోర్టు రెండవ అదనపుజ్యూడిషల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన కసాదిచంద్రయ్య అనేవ్యక్తి గొర్రెలను పెంచుతూ ఉపాధి పొందుతున్నాడు. 2017 ఫిబ్రవరి 14న తన గొర్రెలను మేతకు తీసుకుని వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సంతోష్ అనేవ్యక్తి వాహనాన్ని అతి వేగంగా నడుపుతూ గొర్రెల మందను ఢీ కొట్టాడు. దీంతో సంఘటన స్థలంలో 12 గొర్రెలు మృతి చెందగా మరికొన్ని గాయపడ్డాయి, బాధతుడు అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రణధీర్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటి అధికారి సురేష్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సంతోష్‌కు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఎక్కువ నీడనిచ్చే మొక్కలను పెంచాలి

- రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ కమిషనర్ బి షఫీయుల్లా



మహాత్మానగర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న స్పెషల్ కమిషనర్ బి షఫీయుల్లా

తిమ్మాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ నీడను ఇచ్చే మొక్కల రకాలను, పండ్లమొక్కలను ఎక్కువగా పెంచాలని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ కమిషనర్ బి షఫీయుల్లా అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన దశబ్ధి సంపదవనాలు ప్లాంటేషన్‌ను సందర్శించారు. అందులో పెంచుతున్న మొక్కలు, పండ్లమొక్కలరకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీకి అదనపు ఆదాయాన్ని ఇచ్చే మొక్కలను పెంచినందుకు క్షేత్రస్థాయి సిబ్బందినిఆయన అభినందించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీని ఆయన సందర్శించి నర్సరీలో పెంచుతున్న మొక్కలపై అడిగి తెలుసుకున్నారు. సంపద వనంలో ఓ మొక్కను నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో స్టేట్ ప్లాంటేషన్ మేనేజర్ నర్సింగరావు, డీఆర్డీవో వి శ్రీధర్, ఏపీడీ పి క్రిష్ణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టీపీసీలో రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి..
- మరొకరికి తీవ్రగాయాలు

జ్యోతినగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ సమీప రాజీవ్ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దీకొండ అభిరామ్(18) అనే యువకుడు మృతిచెందాడు. పెద్దూరి అభిరామ్(17) అనే మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మంచిర్యాలలో ఒక మాల్‌లో సెల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్న దీకొండ అభిరాం తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంలో స్వగ్రామం కరీంనగర్‌లో వెళ్తుండగా మార్గమధ్యలో ఎన్‌టీపీసీ బి.పావరాజు గడ్డ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన దీకొండ అభిరామ్ అక్కడిక్కడే మృతిచెందగా పెద్దూరి అభిరామ్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుడి మేనమామ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీపీసీ ఎస్ఐ మానస తెలిపారు.

గంభీరావుపేటలో తాగునీటి కటకట

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గంభీరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని 8, 9, 10వ వార్డులలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని ఆ కాలనీవాసులు శుక్రవారం నిరసన చేపట్టారు. మహిళలు ఖాళీ బిందెలను ప్రధాన రహదారిపై పెట్టి తాగునీటి ఎద్దడి తీవ్రతను తెలిపారు. ఉన్న బోరులో నీరు తగ్గడంతో సరిపడా నీరు రావడం లేదని, మిషన్ భగీరథ పైపులైన్ వేసి సంవత్సరాలు గడుస్తున్నా నీరు రావడం లేదని వాపోయారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని, మురికి కాలువలు కూడా సరిగ్గా తీయక దోమలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలపడంతో పోలీస్‌లు అక్కడికి చేరుకుని వారిని శాంతింపచేశారు.

పింఛను డబ్బులు కాజేశాడనే ఆవేదనతో వృద్ధుడి మృతి



లక్ష్మణ్(ఫైల్)

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పింఛన్ డబ్బులు కాజేశాడనే ఆవేదనతో జగిత్యాల జిల్లాకేంద్రంలోని గాంధీ నగర్‌కు చెందిన నక్క లక్ష్మణ్(66) అనే వృద్ధుడు శుక్రవారం మృతిచెందాడు. నక్క లక్ష్మణ్ ఎస్సారెస్పీలో అటెండర్‌గా విధులు నిర్వహించి 2011లో పదవీ విరమణ పొందాడు. అప్పటి నుంచి 2018 సంవత్సరం వరకు ప్రతి నెల వస్తున్న రూ.20వేల పింఛన్‌తో మతిస్థిమితం లేని ఇద్దరు కూతుళ్లతో పాటు భార్యను పోషిస్తున్నాడు. లక్ష్మణ్ ప్రతినెల పింఛన్ డబ్బులను బ్యాంకు నుంచి డ్రా చేసేందుకు ఇంటిపక్కనే ఉన్న తిరుపతి అనే యువకుడు సహాయ పడుతుండేవాడు. లక్ష్మణ్‌కు సంబంధించిన ఖాతాకు సైతం తిరుపతి తన ఫోన్ నంబరును లింకు చేయించుకున్నాడు. అయితే 2018 తర్వాత పింఛన్ రూ.46వేలకు పెరడగంతో దీన్ని ఆసరాగా చేసుకున్న యువకుడు ఎప్పటిలాగే వృద్ధుడికి రూ.20వేలు ఇస్తూ మిగిలిన డబ్బును తన సొంతానికి వాడుకున్నాడు. ఇలా మొత్తం రూ.18లక్షలను సొంతానికి వాడుకున్నాడు. అయితే పింఛన్ పెరిగిందని తెలుసుకున్న బాధితుడు తన బంధువుల సహాయంతో బ్యాంకుకు వెళ్లగా ఏడు సంవత్సరాల నుంచి రూ.46వేలు వస్తున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు ప్రజావాణిలో కలెక్టర్‌కు మొర పెట్టుకోవడంతో పోలీసులు మోసం చేసిన యువకుడిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. రూ.18లక్షలు మోసపోయానని వృద్ధుడు నెల రోజులుగా తీవ్రమనోవేదనకు గురై శుక్రవారం మృతిచెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది.

ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం లభ్యం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ శివారు ఎస్సారెస్పీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. మృతుడి వయస్సు 40-45 మధ్య ఉంటుందని, పూర్తిగా కుళ్ళిపోయిన స్థితిలో మృతదేహం ఉందని, జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు ఎస్ఐ నెంబర్ 8712656509 కు సంప్రదించాలని తెలిపారు.

బలహీనవర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ

పీసీసీ మాజీ అధ్యక్షుడు హన్మంతరావు




రామోజీపేటలో మాట్లాడుతున్న వీహెచ్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీయే అని మాజీ పీసీసీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు హన్మంతరావు పేర్కొన్నారు. మండలంలోని రామోజీపేట గ్రామంలోని శ్రీసీతారామాశ్రమంలో శుక్రవారం వీహెచ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడో యాత్ర చేపట్టారని, కాంగ్రెస్ పార్టీ అంటేనే నిరుపేదల పార్టీ అని అన్నారు. అనేక సంవత్సరాలుగా వెనకబడిన ప్రజలను గుర్తించి, సరైన అవకాశాలు కల్పించాలని రాష్ట్రంలో కులగణన చేపట్టామన్నారు. కులగణన ద్వారానే ఎంతశాతం జనాభా వెనుకబడిన వర్గాల ప్రజలు ఉన్నారో తెలిసిపోయిందన్నారు.

దీనిని కూడా కొంతమంది విమర్శలు చేసి ప్రజల్లో చులకన అయ్యారన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. అవసరమైతే అన్ని రాష్ట్రాలలో తాను తిరిగి ఏకం చేస్తానన్నారు. బీజేపీ అధికారం కోసమే మత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రామోజీపేట ఆలయానికి అనేక సంవత్సరాల నుంచి వస్తుంటానని తెలిపారు. శ్రీరాముడి ఆలోచన విధానం ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. సమావేశంలో పీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, పీసీసీ నాయకుడు గంప గంప మహేందర్, సిరిసిల్ల పద్మశాలి సంఘ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ఏఎంసీ డైరెక్టర్ కేతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది తర్వాత ప్రత్యేక కోర్సులు

ఇంటర్‌తోపాటు వొకేషనల్, డిప్లొమా కోర్సులు



చొప్పదండి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. తర్వాత ఏ కోర్సులు చేయాలనేది విద్యార్థులకు సంశయం ఏర్పడుతుంది. ఇంటర్మీడియట్ వైపు అందరిచూపు ఉంటుంది. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులను విద్యార్థులు ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇంటర్‌తోపాటు పాలిటెక్నిక్, ఐటీఐ, డిప్లమా, వొకేషనల్ లాంటి అనేక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వివిధ కోర్సుల వివరాల విద్యార్థుల కోసం.

• ఇంటర్..

ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, గురుకులాల్లో ఉన్నాయి.

• ఐటీఐ..

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఫిట్టర్, మెకానికల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్, వైర్‌మెన్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనర్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఫుడ్ ప్రొడక్షన్, వెల్డర్, తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

• పారామెడికల్..

డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (డీఎంఎల్‌టీ), డిప్లొమా ఇన్ హాస్పిటల్ ఫుడ్ సర్వీస్ మేనేజ్‌మెంట్, డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ టెక్నాలజీ, ఫిజియోథెరపీ, ఏఎన్ఎం కోర్సులు ఉన్నాయి.

• ఇంజనీరింగ్..

ట్రిపుల్ ఐటీ, ఐఎంఈ, ఐఈటీ ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

• పాలిటెక్నిక్...

కంప్యూటర్ సైన్స్, సివిల్, మెకానికల్, అగ్రికల్చర్, టెక్నికల్ కెమికల్, సిరమిక్ టెక్నాలజీ, హార్టికల్చర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, ఐటీ, తదితర పాలిటెక్నిక్ కోర్సులు ఉన్నాయి.

• ఎన్‌టీటీఐ..

నేషనల్ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా ఇన్ టూల్ అండ్ డై మేకింగ్, టెక్నికల్ స్కిల్స్, ఎలక్ట్రానిక్స్, మెకట్రానిక్స్, ఫ్యాషన్ డిజైనింగ్, ప్లాంట్ ఇంజనీరింగ్, మానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ.

• డిప్లొమా కోర్సులు...

హోటల్ మేనేజ్‌మెంట్, టూరిజం, అకౌంటెన్సీ, ఇండస్ట్రీస్, పర్సనల్ మేనేజ్‌మెంట్, లెదర్ టెక్నాలజీ, మ్యూజిక్, డ్యాన్స్.

• వొకేషనల్ కోర్సులు..

29 రకాల వృత్తి విద్యా కోర్సులను ఇంటర్ బోర్డు నిర్వహి స్తున్నది. కొన్ని కోర్సులను పూర్తి చేసిన తర్వాత ఇంజనీరింగ్, అగ్రికల్చర్ సెట్ రాసుకోవచ్చు. డిగ్రీ కోర్సుల్లో కూడా చేరవచ్చు.

• సర్టిఫికెట్ కోర్సులు..

డీటీపీ, టాలీ, గ్రాఫిక్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఈ కోర్సులలో కొన్నింటికి ప్రవేశపరీక్ష ద్వారా కళాశాలల్లో చేరే అవకాశం ఉండగా, మిగతా కోర్సులు చదివేందుకు విద్యార్థులకు మెరిట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.



ఉచిత శిక్షణతో స్వయం ఉపాధి

ఎంప్లాయిమెంట్ గ్యారంటీ మార్కెటింగ్ మిషన్ సీఈవో షఫి ఉల్లా

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి మార్గా లతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించు కొని అభివృద్ధి చెందాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక కమిషనర్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ మార్కెటింగ్ మిషన్ సీఈవో షఫి ఉల్లా గ్రామీణ యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని బ్యాంకు కాలనీలో గల వోల్కసి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా ఇస్తున్న ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన కార్యక్ర మాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మూడు నెలల ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన గ్రామీణ యువతీయువకులకు ఇస్తారని, దీన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వోల్కసి టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మోతిలాల్ భార్గవ్, సెంటర్ మేనేజర్ మమత, ఈజీఎంఎం ప్రత్యేక అధికారి నర్సింహారెడ్డి, రవీందర్, శిక్షకులు అనిల్, రాములు, గాజు శ్రీనివాస్, మధుకర్, జ్యోతి, స్పందన, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలలూ.. రారండి..

• చిన్నారుల కోసం ప్రత్యేక గ్రంథాలయం • వేసవిలో అందుబాటులో పిల్లల పుస్తకాలు



కరీంనగర్ గ్రంథాలయంలో బాలల గ్రంథాలయ విభాగం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 4: వేసవి సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలు, ఆటలకే పరిమితం కాకుండా వారిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక బాలల గంథాలయం ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన బాలల గ్రంథాలయంలో పిలల్లకు అవసరమయ్యే అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఇందులో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు ఉపయోగపడే కథలు, నాటికలు, బొమ్మలు, డ్రాయింగ్, పెయింటింగ్స్, పిల్లల వార, మాస పత్రికలు అందుబాటులో ఉంటాయి. పుస్తకాలతో పాటు ఆటలకు కూడా బాలల గ్రంథాలయం నిలయంగా మారింది. చెస్, క్యారం, లూడో, చైనీ చక్కర్ వంటి ఆటలు ఆడుకోవచ్చు. వీటికి ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఒక వేళ నచ్చిన పుస్తకం ఇంటికి తీసుకొని వెళ్లి తిరిగి గ్రంథాలయంలో ఇవ్వాలనుకుంటే ఒక ఫొటో, ఆధార్‌కార్డ్, సంబంధిత స్వల్ప రుసుము చెల్లించి రెండు వారాల్లో తిరిగి గ్రంథాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. వేసవిలో వార్షిక పరీక్షల అనంతరం ప్రతిరోజూ ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలల గ్రంథాలయం సేవలందించనుంది. ప్రతి శుక్రవారంతో పాటు ప్రభుత్వ సెలవు దినాల్లో బాలల గ్రంథాలయం అందుబాటులో ఉండదు. 8 నుంచి 10వ తరగతి ఆపై స్థాయి పిల్లలు కేంద్ర గ్రంథాలయంలో చదువుకోవచ్చు.

పిల్లల కోసం మరిన్ని పుస్తకాలు తెప్పిస్తాం

సత్తు మల్లేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



చిన్నారుల అభిరుచిని బట్టి మరిన్ని విజ్ఞాన, వికాస, చరిత్రాత్మక, కథలు, బొమ్మల పుస్తకాలు తీసుకరావడానికి గ్రంథాలయ సంస్థ సిద్ధంగా ఉంది. బాలల గ్రంథాలయానికి ప్రత్యేక విభాగం ఉంది. ఇందులో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అవకాశం ఉంది. దీన్ని సద్వినియోగం చేసుకొని భావి భరత పౌరు లుగా ఎదగాలని మా ఆకాంక్ష. విద్యార్థులకు గ్రంథాలయం ఆహ్వానం పలుకుతోంది.



బాలల గ్రంథాలయంలో ఆడుకుంటున్న చిన్నారులు (ఫైల్)

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- కొనసాగుతున్న శ్రీరామనవమి వేడుకలు
- రాజన్నను దర్శించుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు
- రాజన్న సేవలో శృంగేరి విరూపాక్ష మఠం పీఠాధిపతి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి భక్తులు తరలివచ్చి ఆలయ వసతిగృహాల్లో విడిది చేశారు. ఉదయం ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఆయా క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని స్వామి వారిని దర్శించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొని గండాదీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు.

కొనసాగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీసమేత అనంత పద్మనాభ స్వామి వారికి పంచోపనిషత్ ద్వారా మహాభిషేక పూజ, పార్వతి రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ యాగశాల ప్రవేశం, మూలమంత్ర హవనం రాత్రి ప్రదోశ కాల పూజ, గ్రామసేవ కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు.

రాజన్న సేవలు ప్రముఖులు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు శుక్రవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుసం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్‌లకు ఆలయ సంప్రదాయం ప్రకారంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. రాజన్న సేవలో పాల్గొన్న అనంతరం కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈవో వినోద్ రెడ్డి శేషవస్త్రం కప్పి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట తహసీల్దార్ విజయ్ ప్రకాశ్‌రావు, సీఐ వీరప్రసాద్, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్, నర్సయ్య, నరేందర్ ఉన్నారు. అలాగే శృంగేరి విరూపాక్షమఠం పీఠాధిపతి విద్యా నృసింహ భారతిస్వామి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవోపేతంగా రాములోరి కల్యాణం..

రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్స వాన్ని వైభవోపేతంగా నిర్వహించాలని ఈవో వినోద్‌రెడ్డి ఉద్యోగులను ఆదేశించారు. ఆలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉద్యోగు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సీతా రామచంద్ర స్వామివారి కల్యాణానికి భారీగా భక్తులు తరలివస్తారని, ఎలాంటి అసౌకర్యా లు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్యాణానికి వచ్చే భక్తులకు తాగునీటి సరఫరా, క్యూలైన్ ఏర్పాట్లు, పారిశుధ్య పనులు, తాత్కాలిక మరుగు దొడ్లు, కల్యాణ వేదికలాంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఆదివారం ఉదయం 11.55 గంటలకు కల్యాణతంతు ప్రారంభమవుతుందని, అనంతరం పూర్ణహతి, సాయంత్రం రథోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈఈ, డీఈ, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి..

రాజన్న ఆలయంలో ఆదివారం నిర్వహించే సీతారాముల కళ్యాణం ఏర్పాట్లును ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీసు సిబ్బంది ఏర్పాటుచేయాలని సీఐ వీరప్రసాద్‌కు సూచించారు. తొక్కిసలాటలు జరగకుండా భక్తులను దృష్టిలో పెట్టుకుని బారికేడ్లు సహాయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. వారి వెంట సీఐ వీరప్రసాద్, ఆలయ డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈ రామకృష్ణరావు, ఏఈవో అశోక్‌కుమార్ ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలి

చందుర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎన్సిడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సత్యేంద్రనాథ్ అన్నారు. చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ సత్యేంద్రనాథ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత ఆధ్వర్యంలో ఎన్సీడీ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం తనిఖీ చేసి, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొమ్ము క్యాన్సరు, ఓరల్ క్యాన్సరు, గర్భాశయ క్యాన్సర్లు, రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల పై అవగాహన కల్పిస్తూ, 100శాతం లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్ కుమార్, సీహెచ్‌వోలు సత్యనారాయణ, బాలచంద్రం, చందుర్తి వైద్యాధికారి డాక్టర్ వేదాచారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- చిన్న హనుమాన్ జయంత్యుత్సవాలపై సమీక్ష



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎస్పీ అశోక్‌కుమార్

మల్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో ఈనెల 11 నుంచి 13 వరకు జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. చిన్న జయంతి ఏర్పాట్లపై శుక్రవారం ఎస్పీ అశోక్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, వివిధ శాఖల అధికారులతో కొండగట్టు దేవస్థానం కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ సమన్వయంతో పని చేయాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తూ భక్తులు వచ్చేదారుల్లో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పార్కింగ్ తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేములవాడ, జగిత్యాల నుంచి కొండగట్టుకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల ఆర్డీవో పి.మధుసూధన్, డీఎస్పీ రఘుచందర్, ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు పలు శాఖలు అధికారులు పాల్గొన్నారు.

● భారీ బందోబస్తు: ఎస్పీ అశోక్‌కుమార్

హనుమాన్ చిన్న జయంతికి వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెయ్యి మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి వంద సీసీ కెమెరాలతో కొండంతా పర్యవేక్షణ చేస్తామన్నారు. అవాంఛనీయ సంఘటనల నివారణకు మఫ్టీ, సీసీఎస్ పోలీసులు అందుబాటులో ఉంటార న్నారు. శాంతియుతంగా ఉత్సవాల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు.

మానసాదేవి ఆలయానికి భక్తుల తాకిడి

- ఆది, మంగళ, శుక్రవారాల్లో విపరీతమైన రద్దీ
- భక్తులతో కిక్కిరిసిపోతున్న ఆర్టీసీ బస్సులు
- అదనపు బస్సులు నడపాలని వేడుకోలు
- స్పందించని అధికారులు



ఖాసీంపేటలో బస్సు వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

గన్నేరువరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేటలో స్వయంభుగా వెలసిన మానసాదేవి, అపురూపలక్ష్మి అమ్మ వార్ల దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో భక్తుల తాకిడి విపరీతంగా ఉంటోంది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిత్యం అన్నదానం చేపడుతున్నారు. ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లో దర్శనం చేసుకునేందుకు ఇటీవల రేలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వహణకు 15మందిని ఏర్పాటు చేసి వారికి 7500 నుంచి 15 వేల వరకు జీతాలను అందజేస్తున్నారు.

కరీంనగర్ నుంచి ఖాసింపేటకు వచ్చే బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. 50 మంది ఎక్కాల్సిన బస్సుల్లో 150మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. బస్సులు సరిపడా లేక ఆలయానికి వచ్చిన భక్తులు గంటల తరబడి ఆలయం వద్ద, అటు కరీంనగర్ బస్టాండ్ వద్ద పడిగాపులుగాస్తున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలని ఆలయ కమిటీ సభ్యులు, స్వచ్ఛందసంఘాల సభ్యులు,కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించిన దాఖలాలు లేవు. మండలానికి రోడ్డు సౌకర్యం సరిగా లేక పోవడం, డ్రైవ ర్లకు సైతం గంటకుపైగా బస్సును నడపడం కత్తి మీద సాములా మారింది. ఇప్పటికైనా కరీంనగర్ ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి సరిపడా బస్సులు నడపాలని భక్తులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



భక్తులతో కిక్కిరిసిన మానసాదేవి ఆలయం

నంబర్‌ప్లేట్ టాంపరింగ్ చేసిన 60 బైకల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ ఒకటో ఠాణా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్‌ప్లేట్‌లు లేకుండా, నంబర్‌ప్లేట్‌లను టాంపరింగ్ చేసినట్లు గుర్తించిన 60 ద్విచక్రవాహనాలను ట్రాఫిక్ పోలీసు ఠాణాకు తరలించి జరిమానాను విధించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి వాహనదారుడు హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్‌ను తప్పని సరిగా అమర్చుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్, ఎస్ఐ ఇషాక్‌అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

●సంక్షిప్తం

●గణేశ్‌నగర్: ఎస్ఆర్ఆర్ కళాశాల కరీంనగర్ వాణిజ్య, వ్యాపార పరిపాలన విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు కరీంనగర్ ఐటీ టవర్, క్షేత్ర పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ట్రైనర్ రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

● కరీంనగర్ టౌన్ : భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు 'స్వవికాస్' పేరుతో మేధో వికాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రముఖ మోటివేషనల్ ఉపన్యాసకుడు జగన్ గురూజీ, వివేకానంద విద్యాసంస్థల అధినేత సొగాని కొమురయ్యతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

● కరీంనగర్ స్పోర్ట్స్: టీజీ పెటా జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అంతటి శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా చిరుత శ్రీనివాస్, కోశాధికారిగా కొడగాని శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి జ్యోతి, ఏముల రవికుమార్, జి నిర్మల, సంయుక్త కార్యదర్శులుగా బి శ్రీధర్, టి భాగ్యలక్ష్మి, మహిళా కార్యదర్శిగా బి వనితారావులు ఎన్నికయ్యారు.

● కరీంనగర్ టౌన్: నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు తమ పాలకవర్గం మల్టిపర్పస్, జ్యోతిబాఫూలే పార్కుతోపాటు మరో 18 పార్కులను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దామని మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మల్టిపర్పస్ పార్కును సందర్శించారు.

● కరీంనగర్ కల్చరల్: సాహితీ సోపతి ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ రచించిన ఏడు పుస్తకాల ఆవిష్కరణ ఉంటుందని సభా సమన్వయ కర్త పెనుగొండ సరసిజ తెలిపారు.

● కరీంనగర్ కల్చరల్: ఉగాది సందర్భంగా శుక్రవారం భగత్‌నగర్ అద్విత ఇంటర్నేషనల్ స్కూల్లో కవితా వేడుక ఘనంగా జరిగింది. అతిథులుగా డైరెక్టర్ సొగాని అనుదీప్, ప్రిన్సిపాల్ మాధురి శ్వేత, వైస్ ప్రిన్సిపల్ దివ్య హాజరయ్యారు.

● గణేశ్‌నగర్: నగరంలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 10:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్,టూ,ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎం లావణ్య తెలిపారు.

● కరీంనగర్ కల్చరల్ : కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి నాటక కళా సంస్థ శుక్రవారంతో 40 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కళాభారతిలో 40వ ప్రదర్శనగా 'స్వప్నం రాల్చిన అమృతం' నాటకం ఆకట్టుకుంది.

● కరీంనగర్ రూరల్: ఎలబోతారం ప్రాథమికోన్నత పాఠశాలలో ఐఎఫ్‌పి, స్మార్ట్ క్లాసరూంను ఎంఈవో రవీందర్ ప్రారంభించారు.

● కరీంనగర్ అర్బన్: ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి పేదల కోసం సన్న బియ్యం పథకం ప్రవేశపెట్టారని డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ పేర్కొన్నారు.

స్మార్ట్‌సిటీ పనులు త్వరగా పూర్తి చేయాలి

మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపట్టిన పెండింగ్ పనులన్నిటినీ త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు, ఆర్వీ కన్సల్‌టెన్సీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీ, కశ్మీరుగడ్డ సమీకృత మార్కెట్, టవర్ సర్కిల్ ఆధునీకరణ పనులపై ప్రత్యేక దృష్టిసారించి పనులు వేగంగా చేపట్టాలని సూచించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ముందు జంక్షన్ పనులను పదిరోజుల్లో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. పద్మనగర్, బొమ్మకల్ జంక్షన్ పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని, రాజీవ్‌పార్కులో సందర్శకులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్ర మంలో ఈఈ సంజీవ్, డీఈ లచ్చిరెడ్డి, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో మొదటిస్థానంలో నిలుపాలి

దేశవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో కరీంనగర్ నగరపాలక సంస్థను ఫస్ట్‌ర్యాంకులో నిలిపేందుకు ఆర్‌పీలు కృషిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశమందిరంలో సమైక్య సంఘాలకు చెందిన మహిళా సభ్యులు, ఆర్‌పీలతో స్వచ్ఛసర్వేక్షణ్‌పై అవగాహన కల్పిం చేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇళ్ల వద్దకు వెళ్లి సచ్ఛసర్వేక్షణ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు విశేష ఆదరణ

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర ప్రారంభించిన నరేందర్‌రెడ్డి 3, 22, 24, 25 డివిజన్‌లలో కొనసాగి సుభాష్‌నగర్ బుద్ధ విగ్రహం వద్ద ముగిసింది. పాదయాత్రలో నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.


గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సుడా చైర్మన్

పాఠశాలల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్, జిల్లా స్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల ఓరియంటేషన్ శిక్షణ కో-ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సప్తగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పదోన్నతి పొందిన వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామ విద్య, ఆరోగ్య విద్య, క్రమశిక్షణను పెంపొందించుటలో వ్యాయామ ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తుంటారన్నారు. కోర్సు ఆర్‌పీలు కే శంకరయ్య, బి వేణుగోపాల్, కనకం సమ్మయ్య పలు అంశాలను వివరించారు.

సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆశ ఫెసిలిటేటర్‌లకు సూచించారు. శుక్రవారం ఆశ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. సిజేరియన్ కాన్పులను తగ్గించాలని సూచించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధ, పీఓడీటీటీ డాక్టర్ ఉమాశ్రీ, డీఐఓ డాక్టర్ సాజిద పాల్గొన్నారు.

సామాజిక అణచివేతపై పోరాటం

భగత్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ అన్నారు. శుక్రవారం నగరంలోని సిఐటియు కార్యాలయంలో సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, రాజేశం, యు శ్రీనివాస్, జనగాం రాజమల్లు, మారేళ్ల శ్రీలత, కొప్పుల శంకర్, కడిరే రమేష్, పుల్లెల మల్లయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సుభాష్‌నగర్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి) 2008 డీఎస్సీ సెలెక్టెడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చినందుకు వారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహం ఎదుట సంబరాలు నిర్వహించారు. 2008 డీఎస్సీ సాధన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రస్థానం

భగత్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మున్సిపాలిటీ ప్రస్థానం ముగిసింది. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న కొత్తపల్లిని గత ప్రభుత్వం మున్సిపాలిటీగా మార్పు చేసింది. ఐదేళ్లు గడవకముందే కొత్తపల్లి మున్సిపాలిటీని రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనం చేసింది. ఇటీవల మున్సిపాలిటీ బోర్డును తొలగించిన అధికారులు నగరపాలక సంస్థ వార్డు కార్యాలయ బోర్డును ఏర్పాటు చేశారు.



నగరపాలక సంస్థగా మారిన కొత్తపల్లి మున్సిపల్ బోర్డు

ఉద్యోగాలు సాధించిన 'తేజస్' విద్యార్థులు

భగత్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీ, నేవీలో తేజస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను తేజస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సీహెచ్ సతీష్‌రావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ ఆర్మీ అగ్నివీర్‌లో 102మంది, ఇండియన్ నేవీ అగ్నివీర్ ఎస్ఎస్ఆర్‌లో 10 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. మార్చి నెలలో గచ్చిబౌలి ఆర్మీ ర్యాలీలో పాల్గొని మెరిట్ సాధించి అగ్నివీర్‌కు ఎంపికయ్యారన్నారు. ఈనెల 5నుంచి ఏఆర్‌ఓ సికింద్రాబాద్‌లో వీరు రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. ఇండియన్ నేవీలో 2024 జరిగిన నియామక ప్రక్రియలో పాల్గొని పది మంది ఎస్ఎస్ఆర్ ఉద్యోగాలు సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటి ఇప్పటికే వేలాది మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో తేజస్ చైర్మన్ సిహెచ్ సతీష్‌రావు

ఆస్తిపన్ను చెల్లింపులపై ఐదు శాతం రిబేట్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణాలు, నగరాల్లో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్తను ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గృహ, వాణిజ్య, వ్యాపార, ఇతర ఇళ్లకు సంబంధించిన ఆస్తి పన్నులు ఈ నెల 30వ తేదీ వరకు ఒకేసారి చెల్లిస్తే పన్నుపై 5శాతం రిబేట్ వర్తిస్తుంది. గత సంవత్సరం వరకు ఆస్తిపన్ను చెల్లించిన వారికే ఎర్లీబర్డ్ స్కీం వర్తిసుందని తెలిపింది.

రోగుల సేవలో నర్సుల పాత్ర కీలకం : కలెక్టర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో రోగులకు సేవ చేయడంలో నర్సుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ మొదటి సంవత్సరం విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగి కోలుకోవడంలో నర్సుల పాత్ర ముఖ్యమైనదని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ నవీన, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల, కాలేజీ ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

శ్రీ వ్రింద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలో గల శ్రీ వ్రింద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం సప్తగిరి కాలనీలో గల శ్రీ కోదండరామాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వొల్లాల శ్రావణ్‌కుమార్, డాక్టర్ సుమభార్గవి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలు, మెరుగైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ వొల్లాల శంకర్‌గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మోడల్ హైస్కూల్ వార్షికోత్సవం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మోడల్ హైస్కూల్ 33వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బాల గోకులం వ్యవస్థాపకుడు గంప వెంకటేశం, మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, నాయకులు వంగల పవన్‌కుమార్, ఎడ్ల అశోక్ హాజరయ్యారు. పాఠశాల వ్యవస్థాపకుడు మాదాసు రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

● భగత్‌నగర్ : రేకుర్తిలోని విజన్ హైస్కూల్‌లో ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్, పాఠశాల డైరెక్టర్స్ వెంకట్, మల్లయ్య, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల ఎదుర్కోలు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రిస్టియన్ కాలనీలోని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి నివాసంలో సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో జరిగే సీతారామ కల్యాణంలో భాగంగా శుక్రవారం ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు.

రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

కరీంనగర్‌రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలం బహదూర్‌ఖాన్‌పేట్‌లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సాయిని తిరుపతి, కాంరెడ్డి రాంరెడ్డి, ఆసంపెల్లి వాసు పాల్గొన్నారు.

● కరీంనగర్ అర్బన్: మంత్రి పొన్నం ఆదేశాల మేరకు సీఎంఆర్‌ఎఫ్ చెక్‌లను కాంగ్రెస్ నాయకురాలు గందె కల్పన శుక్రవారం పంపిణీ చేశారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని బీజేపీ శ్రేణులకు అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని దిశానిర్దేశం చేశారు.

పేదల కళ్లలో ఆనందం

● సన్నబియ్యం పంపిణీపై హర్షం
● ఎప్పటికీ కొనసాగించాలంటున్న ప్రజలు

రామడుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీపై పేదప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న నిరుపేదలందరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడంతో వాటిని వినియోగించుకోవడానికి లబ్ధిదారులు పెద్దసంఖ్యలో రేషన్ డీలర్ల వద్దకు తరలివస్తున్నారు. ఇంతవరకు దొడ్డుబియ్యం పంపిణీచేసిన ప్రభుత్వం మొదటిసారిగా గురువారం నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ చేపట్టింది. రేషన్ షాపుల ద్వారా ఉచితంగా ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున బియ్యం అందజేయడంతో వారి కళ్లలో ఆనందం కదలాడుతోంది. ఈ కార్యక్రమం ఎప్పటికీ కొనసాగించా లని ప్రజలు కోరుతున్నారు.

● ప్రభుత్వం మంచి పనిచేసింది
- రాధ, గోపాల్‌రావుపేట



రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉంది. గతంలో ఎవరు చేయలేని పని కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం పేదప్రజలకు ఎంతో మేలు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంచిపని చేశారు.



రేషన్ షాపులో సన్నబియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

రాజ్యాంగ పరిరక్షణకే పాదయాత్ర

గన్నేరువరం/మానకొండూర్/ జమ్మికుంట/చొప్పదండి/ఇల్లందకుంట/వీణవంక, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని కాంగ్రెస్‌నాయకులు అన్నారు. శుక్రవారం మండలాల్లోని పలుగ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించకుండా ప్రతిఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాజ్యాంగానికి వ్యతి రేకంగా, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవ హరిస్తోందన్నారు. పదేళ్లుగా రాజ్యాంగాన్ని ఖూనీచేస్తూ గాంధీ, అంబేద్కర్‌ను అవమానపరుస్తున్నారన్నారు. అనంతరం ఆయా గ్రామా ల్లో పాదయాత్రను నిర్వహించారు.


గన్నేరువరం: గుండ్లపల్లి వద్ద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అవీ.. ఇవీ..

సైదాపూర్: మండలకేంద్రంలో ధర్మ సమాజ్‌పార్టీ మండలకమిటీ ఆధ్వర్యంలో జిల్లాఅధ్యక్షుడు తాళ్లనరేష్ లక్ష కిలోమీటర్ల రథయాత్రకరపత్రాన్ని ఆవిష్కరించారు.

హుజూరాబాద్: రైతులు రోడ్లపై వరిధాన్యం పోయకుండా సహకరించాలని టౌన్‌సీఐతిరుమల్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్లో ఆయన మాట్లాడారు.

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7580 పలికింది. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠధర రూ.7580, కనిష్ఠ ధరరూ.6వేలుచెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

-తనుగుల గ్రామానికిచెందిన పైడిపల్లి సురేష్ పట్టణంలోని గాయత్రి బ్యాంకులో సేవింగ్‌ఖాతా కలిగిఉన్నాడు. ఇటీవల సురేష్ మృతిచెందగా, ప్రమాదబీమాకింద లక్షరూపాయలచెక్కును సీఐ అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

జమ్మికుంట రూరల్: టీబీ మందులు వాడుతున్న ప్రతిఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న న్యూట్రీషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి డాక్టర్ చందన అన్నారు.

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి, లస్మక్కపల్లి చల్లూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్‌లలో ప్రీస్కూల్ సంబరాలను నిర్వహించారు.

చొప్పదండి: మండలంలోని రేవెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చొప్పదండి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు.

-మండలంలోని రుక్మాపూర్ జడ్పీ ఉన్నతపాఠశాలలో ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గంగాధర: గంగాధర బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ కార్గోసేవలను శుక్రవారం నుంచి పునరుద్ధరించారు. గతంలోమాదిరిగా ప్రజలు కార్గోసేవలను సద్వినియోగం చేసుకోవాలని కార్గోఇన్‌చార్జి రామారావు తెలిపారు.

-మహిళ ఆరోగ్యసంరక్షణ కోసంఏర్పాటు చేసిన శుక్రవారం సభలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్‌సూపర్‌వైజర్ రేణుకఅన్నారు.

చిగురుమామిడి: చిగురుమామిడి ఎస్సైగా సందబోయిన శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఫ్రెండ్లీపోలీస్ వ్యవస్థనుప్రజల్లోకి మరింతతీసుకెళ్లడానికి సహకరించాలని అన్నారు.

-అంతరించిపోతున్న కళలను నేటితరానికి తెలియచేయడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని మాజీసర్పంచ్ బొయిని శ్రీనివాస్, ఉపసర్పంచ్‌కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ సభ్యుడు బూడిద సదాశివ అన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

హుజూరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ వార్డులోని అంగన్‌వాడీకేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరుచేయడం వలన కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న వార్డు అధికారి రమాదేవి, శానిటరీ జవాన్, సుధీర్, తడి, పొడిచెత్తను వేరుచేయడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్‌ను సన్మానించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఏసీపీ

హుజూరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. శుక్రవారం డివిజన్‌లో నంబర్‌ప్లేట్లు లేని వాహనాలు, మైనర్‌డ్రైవింగ్‌పై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్ డ్రైవింగ్ చేస్తున్న 16, నంబరు ప్లేట్లు లేని సుమారు 67వాహనాలను సీజ్‌చేశారు. సీఐలు తిరుమల్‌గౌడ్, పులి వెంకట్‌గౌడ్, కిశోర్, రవి, ఎస్ఐలు పాల్గొన్నారు.

హార్వెస్టర్ యజమానులు రైతులకు సహకరించాలి

శంకరపట్నం/చొప్పదండి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వరికోతలలో హార్వెస్టర్ల యజమానులు రైతులకు సహకరించాలని తహసీల్దార్లు భాస్కర్, నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రాల్లో హార్వెస్టర్ల యజమానులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరికోతల సమయంలో బ్లోయర్ స్పీడ్ 18నుంచి 19 ఆర్‌పీఎం పెట్టి కోయాలని సూచించారు. తాలు, తప్ప లేకుండా పరిశుభ్రంగా ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని కోరారు.

చింతకుంట విద్యార్థులకు బ్యాగులు, బుక్స్ పంపిణీ

భగత్‌నగర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట వర్క్‌సైట్ స్కూల్ జిల్లా కలెక్టర్ పంపిణీ చేసిన బ్యాగులు, డ్రాయింగ్ బుక్స్, కనెక్టర్ పెన్, క్రెయాన్స్, నోట్ బుక్స్‌లను జిల్లా విద్యాశాఖాధికారులు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి కె అశోక్‌రెడ్డి, బ్రిక్‌లైన్ ఓనర్స్ నారాయణరెడ్డి, మండల విద్యాధికారి తుమ్మ ఆనందం, ఎంపిపిఎస్ హెచ్‌ఎం రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

రామడుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల పరిధిలోని గుడ్డేలుగులపల్లికి చెందిన గిట్ల సాయిచరణ్ అనే దివ్యాంగుడికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ట్రైసైకిల్ అందజేశారు. యువకుడి తండ్రి చిన్నతనంలోనే చనిపోగా ప్రస్తుతం ఇంటర్ మొదటిసంవత్సరం కరీంనగర్ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్నాడు. కళాశాలకు బస్సులో వెళ్లడానికి చాలా ఇబ్బంది అవుతుందని ఎలక్ట్రికల్ చార్జింగ్ వెహికిల్ కావాలని రెండురోజుల క్రితం ఎమ్మెల్యేను కలవగా, వెంటనే స్పందించిన ఆయన వికలాంగుల జిల్లాసంక్షేమశాఖ అధికారితోఫోన్‌లో మాట్లాడి సాయిచరణ్‌కు వెహికిల్ వెంటనే అందజేయాలని కోరారు. దీంతో అధికారులు యుద్ధప్రాతిపదికన ట్రైసైకిల్‌ను ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే అందజేశారు.


సాయిచరణ్‌కి ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

విద్యుత్ అధికారుల పొలంబాట

గన్నేరువరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకలివానిపల్లి గ్రామంలో శుక్రవారం విద్యుత్‌శాఖ కరీంనగర్ డీఈ ఉపేందర్, ఏడీఈ నరేందర్, మండల ఏఈ ఆంజనేయులు రైతులతో కలిసి పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల పొలాలవద్ద ఉన్న బావుల మోటార్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తీసుకోవాలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులందరూ బావుల వద్ద కెపాసిటర్లను బిగించుకొని విద్యుత్‌సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

జమ్మికుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వడిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల7నుంచి కంప్యూటర్ ఫండమెంటల్స్‌లో వేసవి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం అవుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులతోపాటు ఉత్సాహవంతులైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల ధర్నా

భగత్‌నగర్ : కరీంనగర్‌లో ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆర్టీసీ డిపో ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లకు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ మోహన్ రెడ్డి, పి మల్లయ్య, టిఎస్ నారాయణ పాల్గొన్నారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ ఆర్టీసీ డిపో కార్యాలయం ఎదుట రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులు శుక్రవారం ధర్నాచేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ సూపరింటెండెంట్ వీవీఆర్‌రెడ్డి, ఎల్ సారయ్య, శుభవర్ధన్, ప్రభాకర్‌రెడ్డి, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, వీఎల్ రావు పాల్గొన్నారు.


హుజూరాబాద్‌లో ధర్నా చేస్తున్న రిటైర్డ్ కార్మికులు

ఇల్లందకుంట ఆలయ రెనోవేషన్ కమిటీ

ఇల్లందకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ రెనోవేషన్ కమిటీని నియమించినట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీమెంబర్లుగా ఇంగిలే రామారావు, కారింగుల రాజేందర్, కురిమిండ్ల చిరంజీవి, అడ్ల కిషన్‌రెడ్డి, గోలిరవికిరణ్, గొడిశాల పరమేశ్వర్, బొమ్మలావణ్య, సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మర్రి రాంరెడ్డి, కాసం నాగ రాజు, మూడెత్తుల మల్లేశం, జుముతుల మధుకర్‌రెడ్డి, వీరమల్ల తిరుపతిరెడ్డి, రిక్కల నారాయణరెడ్డిని నియమించారు. కమిటీ ఏడాదిపాటు కొనసాగనుంది.

యాంటీ డ్రగ్స్ పోస్టర్ ఆవిష్కరణ

రామడుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ సామాజిక న్యాయం, సామాజికసేవ చేంజ్‌ఫర్ ఇండియా ఆధ్వర్యంలో రూపొందించిన యాంటిడ్రగ్స్ పోస్టర్‌ను రామడుగు ఎస్ఐ రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జెట్టిపల్లి అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు తడగొండ ప్రవీణ్‌కుమార్, సురేష్, మాచర్లదివ్య, పర్లపెల్లిమహేష్, కోలపురివెంకటేశ్ పాల్గొన్నారు.